
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం। 7। జూన్। 2023



మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం 8లో

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యమని డీఎంహెచ్‌వో జమాల్ బాషా సూచించారు.



'దారి'ద్రం తీరింది.. 8లో

అత్యంత మారుమూల ప్రాంతమైన రంగబయలు పంచాయతీకి పక్కా రహదారి నిర్మించడంతో 28 గ్రామాలకు అవస్థలు తప్పాయి.



గిరిపుత్రుల జీవనంపై సినిమా

రోలుగుంట, నాతవరం మండలాల్లోని గిరిజన ప్రాంతాల్లో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 8లో

న్యూస్‌రీల్

క్రీడాకారుడికి అభినందన



క్రీడాకారుడు బుద్ధును అభినందిస్తున్న పీవో అభిషేక్

అరకులోయ రూరల్: టీసీఎస్ వరల్డ్ 10కె రన్ పరుగు పందెంలో రాణించిన మండలానికి చెందిన క్రీడాకారుడు బుద్ధును ఐటీడీఏ పీవో అభిషేక్ మంగళవారం అభినందించారు. దీనిలో భాగంగా క్రీడాసామగ్రిని అందజేశారని క్రీడాకారుడు బుద్ధు తెలిపాడు. ఐటీడీఏ పీవో రూ.23 వేల ఆర్థికసాయం అందజేసి 10కే రన్‌లో పాల్గొనేందుకు ప్రోత్సహించారని తెలిపారు. ఈ నెల 10న గోవాలో జరిగే రివర్ మారథాన్ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నట్టు తెలిపాడు. ఐటీడీఏ అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని బుద్ధు పేర్కొన్నాడు.

ఘనంగా ముగిసిన మోదమ్మ ఉత్సవాలు



నక్కలపుట్టులో మోదకొండమ్మతల్లి ఉత్సవ విగ్రహం, ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

సాక్షి, పాడేరు: మన్యప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మతల్లి ఉత్సవాలు నక్కలపుట్టు, మినుములూరు గ్రామాల్లో మంగళవారంతో ఘనంగా ముగిశాయి. ఆయా గ్రామాల్లో మోదకొండమ్మతల్లి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఘటాలను భక్తులు గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. నక్కలపుట్టులోని అమ్మవారి ఘటాలను వంతాడపల్లి తోటలు ప్రాంతంలోని మోదమ్మ ఆలయం వరకు, మినుములూరులోని సతకంపట్టు వద్ద కొలువుదీర్చిన ఘటాలను ఘాట్‌లోని మో దమ్మ తల్లి పాదాలు గుడి వరకు ఊరేగించి సమర్పించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

పాడేరు రూరల్: పాడేరు ఐటీడీఏ పరిధిలోని గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పీవో వి.అభిషేక్ అన్నారు.ఈ నెల 9వ తేదీన బాలురకు, 10 వ తేదీన బాలికలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. స్థానిక ఏపీఆర్ బాలికల కళాశాలలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్ గడువు పొడిగింపు



వెంకటరమణ

మురళీనగర్: పాలిటెక్నిక్ కళాశాలకు ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ గడువును పొడిగించినట్లు పాలిటెక్నిక్ ప్రవేశాల రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. వాస్తవానికి సోమవారంతో గడువు ముగినప్పటికీ.. విద్యార్థులకు మరొక అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో గడువు పొడిగించారన్నారు. కొత్తగా రిజిస్ట్రేషన్ కోసం ప్రాసెసింగ్ ఫీజు చెల్లించుకోవడానికి, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి అనివార్య కారణాల వల్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోలేకపోయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీరు సమీప హెల్ప్‌లైన్ కేంద్రానికి వెళ్లి సర్టిఫికెట్లు పరిశీలన చేసుకోవచ్చన్నారు. వెబ్ ఆప్షన్లకు సంబంధించి సమాచారం రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వెబ్‌సైట్‌లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. కాగా.. జిల్లాలోని వివిధ హెల్ప్‌లైన్ కేంద్రాల్లో మంగళవారం కౌన్సెలింగ్ కొనసాగింది. స్వల్ప సంఖ్యలో విద్యార్థులు హాజరై తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారు. బుధవారం కూడా కౌన్సెలింగ్ కొనసాగుతుంది.

అమెరికన్ ఇంగ్లిష్ శైలిపై ఉచిత శిక్షణ

సీతంపేట: తన్మయి క్రియేటివ్స్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ నెల 9, 10 తేదీల్లో అమెరికన్ ఇంగ్లిష్ శైలిపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రోగ్రామ్ కన్వీనర్ బాదంగీర్ సాయి తెలిపారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు వీఎస్టీ తెలుగు ఇంగ్లిష్ డిక్షనరీ రచయిత సనపల జీవన్‌కుమార్ శిక్షణ ఇస్తారని, కేవలం 40 మందికి మాత్రమే ఈ అవకాశం కలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 94404 58458, 82478 29025ను సంప్రదించి.. పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బరిసింగి రోడ్డుకు మోక్షం

- 50 ఏళ్లుగా సమస్యను పట్టించుకోని పాలకులు
- దృష్టి సారించిన కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- ప్రభుత్వానికి నివేదించడంతో నిధులు మంజూరు
- 4.95 కిలోమీటర్లకు రూ.2.12 కోట్లు
- పనులు పూర్తి కావడంతో 20 గ్రామాల గిరిజనుల్లో ఆనందం



బరిసింగి-డేగలవీధి రోడ్డు

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీడీఏ వెనుక నుంచి కొండ మీదుగా బరిసింగి, డోకులూరు పంచాయతీల్లోని గ్రామాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం పక్కా రోడ్డుగా అభివృద్ధి చేయడంతో రవాణా కష్టాలు గట్టెక్కాయి. పాడేరులో 1975లో ఐటీడీఏ స్థాపించగా ఈ 50ఏళ్లలో అనేక ప్రభుత్వాలు పాలించాయి. ఎంతోమంది మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాడేరును పాలించారు. 40మందికి పైగా ఐటీడీఏ పీవోలు పనిచేశారు. 2019 ఎన్నికల వరకు ప్రతిసారి బరిసింగి–డోకులూరు రోడ్డు ఎన్నికల ప్రచార అస్త్రంగా అభ్యర్థులకు ఉపయోగపడేది. అధికారంలో ఉన్నవారు, ప్రతిపక్ష పార్టీలు అంతా బరిసింగి రోడ్డును అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చేవారు. అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించేవారు. ఈ రోడ్డు అభివృద్ధి పేరుతో గతంలో నిధులు కూడా దుర్వినియోగం అయినట్టు ఆరోపణలు కూడా ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వం కూడా తారురోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చింది. ఘాట్‌లో పలు చోట్ల సీసీరోడ్లకే పరిమితం చేసింది.

యజ్ఞంలా కృషి

బరిసింగి–డేగలవీధి రోడ్డు అభివృద్ధికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి యజ్ఞంలా కృషి చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి రోడ్డు సమస్యను తీసుకువెళ్లారు. ఆయన వెంటనే పరిశీలించారు. గిరిజనుల కష్టాలను తెలుసుకున్నారు. దీనిపై కలెక్టర్, ఎమ్మెల్యే ప్రభుత్వానికి నివేదించారు. ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టు కింద 4.95 కిలోమీటర్లకు రూ.2.12 కోట్లతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వీటితో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు అద్దంలా మెరిసిపోతోంది.

దగ్గర మార్గంతో..

బరిసింగి మీదుగా డేగలవీధి, డోకులూరు వరకు తారురోడ్డును పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నాణ్యత ప్రమాణాలతో నిర్మించారు. బైక్‌లు, ఆటోలు, జీపులు, ఇతర వాహనాలు రయ్‌రయ్ మంటూ పరుగులు తీస్తున్నాయి. రవాణా సమస్య పరిష్కారం కావడంతో బరిసింగి, డోకులూరు పంచాయతీల్లోని 20 గ్రామాల గిరిజనుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఒక రోడ్డు సౌకర్యంతోపాటు మరోపక్క పాడేరుకు దగ్గరి మార్గం అందుబాటులోకి వచ్చింది.

అభివృద్ధిని స్వాగతిస్తున్నాం



బరిసింగి–డేగలవీధి రోడ్డు అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా గిరిజనులమంతా స్వాగతిస్తున్నాం. పూర్వం నుంచి మా గ్రామాలకు తారురోడ్డు సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో అనేక పోరాటాలు చేశాం. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్ కుమార్ నిధులు సమకూర్చి తారురోడ్డు నిర్మాణం పూర్తిచేయడం, తమ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తేవడం సంతోషంగా ఉంది.

– సీదరి సుబ్బారావు, టీడీపీ మాజీ ఎంపీటీసీ, బరిసింగి, పాడేరు మండలం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



తమ గ్రామాలు పాడేరుకు దగ్గరలోనే ఉన్నప్పటికీ పూర్వం నుంచి రోడ్డు అభివృద్ధి చెందక రవాణా పరంగా తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. గత పాలకులు బరిసింగి–డేగలవీధి తారురోడ్డు అభివృద్ధిని పట్టించుకోలేదు. పక్కా రోడ్డుతో పాటు రవాణా సౌకర్యాలకు నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– కురబోయిన సన్నిబాబు, సర్పంచ్, డోకూలూరు, పాడేరు మండలం

నేడు గాం గంటందొర విగ్రహావిష్కరణ

- లంకవీధిలో ఆయన వర్ధంతికి ఏర్పాట్లు
- హాజరుకానున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



గంటందొర విగ్రహం ఏర్పాటుకు సిద్ధం చేస్తున్న సిమెంటు దిమ్మ



స్టేజి ఏర్పాటు పనుల్లో నిమగ్నమైన కూలీలు

కొయ్యూరు: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అనుచరుడు గాం గంటందొర శతాధిక వర్ధంతిని బుధవారం ఆయన స్వగ్రామం లంకవీధిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి హాజరవుతున్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్ పర్యవేక్షణలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గంటందొర విగ్రహం ఏర్పాటుకు సిమెంటు దిమ్మను ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యేతో పాటు ఇతర నేతలు విగ్రహ ఆవిష్కరణలో పాల్గొంటారు. ప్రజాప్రతినిధులు అందరికి కూడా సమాచారం ఇచ్చారు. ఇలావుండగా విశాఖ బీచ్ రోడ్డులో స్వాతంత్య్ర సమరయోధులు గాం గంటందొర, మల్లుదొర విగ్రహాలను ఏర్పాటు చేయాలని భారతీయ ఆదివాసీ సమాఖ్య ఏపీ అధ్యక్షుడు గడుతూరి రామ్‌గోపాల్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన స్వాతంత్య్ర సమరయోధులకు అన్యాయం జరుగుతోందన్నారు. పాడేరులో ఏర్పాటుచేస్తున్న మెడికల్ కళాశాలకు, కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయానికి గంటందొర, మల్లుదొరల పేర్లు పెట్టాలని కోరారు. దేశం కోసం అశువులు బాసిన వారి కుటుంబాలు నేడు దయనీయ స్థితిలో ఉన్నాయని తెలిపారు. వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. దీనిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.గంగరాజు, మర్రి కామరాజు, సురగం సత్యనారాయణ, బి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పావుర్లంకలో తునికాకు బస్తాల దగ్ధం



ఘటనాస్థలంలో విచారణ నిర్వహిస్తున్న రేంజర్, సిబ్బంది

చింతూరు: మండలంలోని పావుర్లంకలో సోమవారం అర్ధరాత్రి 25 తునికాకు (బీడీఆకు) బస్తాలు దగ్ధమయ్యాయి. ఎండిన తునికాకులను బస్తాల్లో నింపి కల్లంలో కుప్పగా ఉంచిన నేపథ్యంలో అవి దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై చింతూరు డీఎఫ్‌వో పుష్పసౌజన్య ఆదేశాల మేరకు నెల్లిపాక రేంజ్ అధికారి సత్యనారాయణమూర్తి మంగళవారం గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించారు. ఈ ఘటనలో 22 వేల తునికాకు కట్టలు దహనం కాగా రూ.65 వేలు నష్టం వాటిల్లినట్లు రేంజర్ తెలిపారు. కాగా ఛత్తీస్‌గఢ్ సరిహద్దులకు ఆనుకుని వున్న పావుర్లంకలో నిల్వచేసిన తునికాకు బస్తాలను మావోయిస్టులు దగ్ధం చేసినట్టుగా ప్రచారం జరుగుతోంది. కాంట్రాక్టర్లు తునికాకు గిట్టుబాటు ధర ఇవ్వక పోవడంతో పాటు బోనస్ చెల్లించడం లేదనే కారణంతో మావోయిస్టులు ఈ ఘటనకు పాల్పడినట్లుగా తెలుస్తోంది.

గంజాయి, సారా రవాణాకు అడ్డుకట్ట

రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహాల్లి



వై.రామవరం పోలీసుస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏఎస్పీ జగదీష్ అదహాల్లి

వై.రామవరం: గంజాయి, నాటుసారా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని రంపచోడవరం ఏఎస్పీ ఎ.జగదీష్ అడహాల్లి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగు కేసుల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ భద్రత ఏర్పాట్లను, సీఆర్ పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు బలగాల భద్రత ఏర్పాట్లు, సెంట్రీ పోస్టులను పరిశీలించారు. చేర్పులు మార్పులపై సలహాలు, సూచనలు ఇచ్చారు. పోలీసు స్టేషన్ ఆవరణలో నిర్మించిన స్టేషన్ నూతన భవనాన్ని పరిశీలించారు. సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు, గం జాయి, నాటుసారా అక్రమ రవాణా, తదితర అంశాలపై ఆరా తీశారు. స్టేషన్‌కు, సీఆర్‌పీఎఫ్ పోలీసులకు అవసరమైన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విధుల నిర్వహణలో అప్రమత్తతపై సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో అడ్డతీగల సీఐ వై.రాంబాబు, సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంట్ ఎంఎల్ నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఎస్‌ఐ ఎం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వాహనాల వేలం ద్వారా రూ.1.9 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

అడ్డతీగల: వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు వాహనాల వేలం ద్వారా రూ.1.9 లక్షల ఆదాయం లభించింది. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని గతంలో సారా,మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన నాలుగు బైక్‌లకు రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహాల్లి, అడ్డతీగల సీఐ రాంబాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐ అప్పలరాజు బహిరంగ వేలం నిర్వహించారు.

అడవుల సంరక్షణపై దృష్టి

చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ



చింతపల్లిలో అటవీశాఖ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ

చింతపల్లి: పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తించి అందుకు నిరంతరం కృషి చేయాలని చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ అన్నారు. మంగళవారం చింతపల్లిలో అటవీశాఖ అధికారులు, ఉద్యోగులతో ఆయన సమావేశం అయ్యారు. చింతపల్లి డివిజన్ పరిధిలో అటవీ వనాలను సంరక్షించడంతోపాటు విధిగా మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని కోరారు. రక్షిత అటవీ ప్రాంతాల్లో కలప అక్రమ నరికివేత, రవాణాకు గురికాకుండా నిఘాను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. సబ్‌డీఎఫ్‌వో బెర్నాడ్‌రాజు, పెదవలస, లోతుగెడ్డ, మర్రిపాకలు, చింతపల్లి రేంజి అధికారులు భార్గవ వర్మ, జగదీష్, చిట్టితల్లి, పాత్రుడు, డీఆర్వోలు వెంకటరాజు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి తాగునీటి సదుపాయం

అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ



కుంతుర్లలో రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

పెదబయలు: ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకంలో ప్రతీ గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పిస్తున్నట్టు అసిస్టెంట్ కలెక్టర్ అశుతోస్ శ్రీవాత్సవ అన్నారు. మండలంలోని మారుమూల కుంతుర్ల పంచాయతీ కేంద్రంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కుంతుర్ల పంచాయతీలో కొన్ని గ్రామాల్లో జలజీవన్ మిషన్‌లో తాగునీటి పథకాలు పూర్తిచేసినట్టు తెలిపారు. కుంతుర్ల పంచాయతీ కేంద్రానికి అనుసంధానం చేస్తూ ఆరు గ్రావెల్ రోడ్ల నిర్మాణం జరిగిందని అన్నారు. పాడేరు మండలం బంట్రోతుపుట్టు నుంచి కుంతుర్ల వరకు తారురోడ్డు నిర్మాణం చేపట్టినట్టు చెప్పారు. కుంతుర్ల గ్రామ సచివాలయం ఏర్పాటుతో ప్రజలకు పథకాలు పొందడానికి ఎంతో సదుపాయంగా మారిందని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి పథకాలు అందించాలని సూచించారు. జేజేఎంలో నిర్మించిన తాగునీటి పథకాలను, గ్రామసచివాలయ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, ఎంఈవో చెట్టి సంజీవరావు, గిరిజన సంక్షేమ శాఖ ఏఈ ధ్రువకుమార్, ఎంపీటీసీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిరిజన సంస్కృతి సంబరాలు



డప్పు వాయిద్యాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న గిరిజన సంఘాల నేతలు

అరకులోయ రూరల్: స్థానిక గిరిజన మ్యూజియం ఆవరణలో గిరిజన సంఘం 8వ మహాసభల్లో భాగంగా గిరిజన సంస్కృతి సంబరాలు నిర్వహించారు. 6,7,8 మూడురోజుల పాటు సంబరాలు జరుగుతాయని గిరిజన సంఘ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఎం మాజీ ఎంపీ మధు పాల్గొని వేడుకలను ప్రారంభించారు. చింతూరు కొమ్ము, కోయ డ్యాన్స్, అరకులోయ థింసా, సంకిడి గీతాలాపనలు, కళాకారిణుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గిరిజన ఉద్యోగ, ప్రజా సంఘాల నేతలు గిరిజన ఆచార సంప్రదాయ డప్పు వాయిద్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మధు, గిరిజన సంఘం నాయకులు అప్పలనర్సయ్య, కిల్లో సురేంద్ర, బాలదేవ్ మాట్లాడారు. గిరిజన ఆచార సంప్రదాయాలను పరిరక్షించేందుకు ఈ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన పూర్వీకుల ఆచార సంప్రదాయలను నేటితరం అందుకోవాలని కోరారు. ఆదివాసీ ప్రజా సంఘాల ప్రతినిధులు రామరావు, సురేష్, రామన్న, చిట్టిబాబు, బుజ్జిబాబు పాల్గొన్నారు.




చింతూరు ఆదివాసీ మహిళల ప్రదర్శన



అరకు మహిళల థింసా నృత్యం

గాలివానకు దెబ్బతిన్న పైకప్పులు



గాలికి ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

చింతూరు: మంగళవారం సాయంత్రం వీచిన గాలి దుమారానికి మండలంలోని రామన్నపాలెం, పెద శీతనపల్లి, బొడ్రాయిగూడెంలో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడంతో పాటు, విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. రామన్నపాలెంలో గాలి వేగానికి సర్పంచ్ మడకం వెంకటలక్ష్మి, సోడె రామకృష్ణకు చెందిన ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. 20 విద్యుత్ స్తంభాలతో పాటు సుమారు 10 చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది హుటాహుటిన ఆయా గ్రామాలకు వెళ్లి విద్యుత్ పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టారు.

చింతపల్లి: మండలంలోని తాజంగి పంచాయతీ బలభద్రం గ్రామంలో ఇటీవల రెండు రోజుల కిందట కురిసిన భారీ వర్షం, ఈదురుగాలుల తాకిడికి వనుము శ్యాం సుందర్ ఇంటి పైకప్పు పూర్తిగా ఎగిరిపోయింది. జరిగిన నష్టాన్ని గుర్తించి పరిహారం ఇప్పించాలని బాధితుడు అధికారులను కోరుతున్నాడు.



ఇంటి సమీపంలో కూలిన చెట్టు



బలబద్రంలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు

భక్తుల పెన్నిధి మోదమ్మ సన్నిధి



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఘటాలను తీసుకువస్తున్న భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత మాడుగుల మోదకొండమ్మ పండగ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. పూలమాలలు, బంగారు ఆభరణాలతో అమ్మవారిని అపూర్వంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ఘటాలను శిరసున పెట్టుకుని సుమారు 3 కిలోమీటర్ల దూరం బారులు తీరారు. సతకం పట్టు వద్ద ప్రత్యేక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నేలవేషాలు

ఎడ్లబళ్ల వేషాలు, తప్పెటగుళ్లు, ఖవ్వాలీ డ్యాన్స్‌లు, పులివేషాలు, కేరళ, ఢమరుక నాదాలు, కర్ణాటక మహిళా కళాకారులతో డప్పు వాయిద్యాలు, కోలాటాల నడుమ అమ్మవారి సంబరం అంబరాన్నంటింది. కళ్లు మిరిమిట్లు గొలిపే విధంగా ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ సెట్టింగ్‌లు చూపరులను ఆకట్టుకున్నాయి. మహారాజుల కోటలో బాణసంచా వెలుగులను భక్తులు ఆసక్తిగా తిలకించారు. పండగ రోజుల్లో సురభి బృందం ప్రదర్శించిన నాటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అమ్మవారి సన్నిధిలో మాడుగుల మహారాణి

మాడుగుల మహారాణి మయాంక కుమారిదేవ్ మంగళవారం మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన రాణికి ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సభ్యులు దంగేటి సూర్యారావు, పైడినాయుడు ఘనస్వాగతం పలికారు.

క్లుప్తంగా

10న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాక

మహారాణిపేట: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి ఈ నెల 10న విశాఖ వస్తున్నారు. సాయంత్రం 4.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని.. అక్కడి నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు వెళ్తారు. అక్కడే రాత్రి బస చేస్తారు. 11న రైలులో తిరిగి విజయవాడ వెళతారు.

జస్టిస్ చక్రవర్తి రాక నేడు

హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.ఎల్.ఎన్ చక్రవర్తి బుధవారం విశాఖ వస్తున్నారు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఉదయం విశాఖ చేరుకుని.. అక్కడి నుంచి బీచ్‌రోడ్డులోని పోలీస్ గెస్ట్ హౌస్‌కు వెళ్తారు. అనంతరం బురుజుపేటలో కొలువై ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత సంపత్ వినాయగర్ ఆలయాన్ని సందర్శించి.. అక్కడ ప్రత్యేక పూజలు చేస్తారు.

జస్టిస్ రాధాకృష్ణ కృప సాగర్..

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వి.రాధా కృష్ణ కృప సాగర్ బుధవారం విశాఖ వస్తున్నారు. రత్నచల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ చేరుకుని.. ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో బస చేస్తారు. సాయంత్రం వేపగుంటలో జరిగే వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి విజయవాడ వెళతారు.

కమ్యూనిస్టు నేత మాకిరెడ్డి మృతి



వై.మాకిరెడ్డి (ఫైల్)

నర్సీపట్నం: మాకిరెడ్డి ఎర్రినాయుడు అలియాస్ వై.మాకిరెడ్డి (76) విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజున మాకిరెడ్డి జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో విద్యార్థి సంఘ నాయకుడిగా (ఏఐఎస్ఎఫ్) రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. వామపక్ష పార్టీలలో వై.మాకిరెడ్డి సుదీర్ఘకాలం పనిచేసి తనదైన ముద్ర వేసుకున్నారు. దళిత, గిరిజన వర్గాల ప్రజల భూ సమస్యలపై అనేక పోరాటాలు చేసి అండగా నిలిచారు. ప్రస్తుతం రాష్ట్ర సమాచార హక్కు చట్టం ఫోరం కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. మాకిరెడ్డి మృతికి వామపక్ష నాయకులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నారు.

‘దారి’ద్య్రం తీరింది..

- రంగబయలు పంచాయతీ కేంద్రానికి బీటీ రోడ్డు నిర్మాణం
- తీరనున్న 28 గ్రామాల రవాణా సమస్య



రంగబయలు పంచాయితీ కేంద్రానికి నిర్మించిన బీటీ రోడ్డు

ముంచంగిపుట్టు: మండలంలోని రంగబయలు పంచాయతీ అత్యంత మారుమూల ప్రాంతం. ఒడిశా సరిహద్దులో ఉన్న ఈ పంచాయతీకి పక్కా రహదారి సౌకర్యం లేక ఇన్నాళ్లూ 28 గ్రామాల ప్రజలు ప్రయాణానికి పడరాని పాట్లు పడ్డారు. అనారోగ్యం బారిన పడిన వారిని సకాలంలో ఆస్పత్రికి చేర్చలేకపోవడంతో మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం. వర్షాకాలం నాలుగు నెలలు రంగబయలు పంచాయతీలో ఉన్న గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయేవి. రోడ్డు నిర్మించాలని ఈ ప్రాంతంలోని 28 గ్రామాల గిరిజనులు పలు మార్లు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా రహదారి సమస్య తీర్చినవారే కరువయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన గ్రామాలకు పక్కా రహదారుల కల నెరవేరుతోంది.

ఎంపీ మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రత్యేక చొరవతో 2020లో పీఆర్ ప్రాజెక్ట్సు ద్వారా వనుగుమ్మ పంచాయతీ కేంద్రం నుంచి రంగబయలు పంచాయతీ కేంద్రం మీదగా జోడిగుమ్మ వరకు 18 కిలో మీటర్ల రహదారి నిర్మాణానికి రూ.16.90 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో 90శాతం పనులు పూర్తయ్యాయి. దీంతో ఆ ప్రాంత గిరిజనుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఈ నెలాఖరులోగా నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఈ రోడ్డును పనులను పర్యవేక్షిస్తున్న పీఆర్ ప్రాజెక్స్ అధికారులు తెలిపారు.

రహదారి కష్టాలు తీరాయి



రంగబయలు పంచాయతీ కేంద్రానికి గతంలో సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో 18 కిలో మీటర్ల మేర గెడ్డలు, కొండలు దాటి ప్రయాణించేవారం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో బీటీ రోడ్డు మంజూరు అవడంతో పాటు పనులు పూర్తవడంతో వ్యయప్రయాసలు తగ్గాయి. రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో ఎంతో సంతోషంగా ఉంది.

– ఎస్.భాగ్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు, రంగబయలు సెగ్మెంట్

హామీ నెరవేర్చాం



28 గ్రామాల గిరిజనుల చిరకాల వాంఛ తీరింది. ఎన్నికల ముందు ఈ గ్రామానికి వెళ్లే మార్గాన్ని చూసి ఎంతో బాధ పడ్డాను. నిత్యావసర సరకుల కోసం గ్రామస్తులు గుర్రాలపై వచ్చి తీవ్ర ఇబ్బందులు పడేవారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా రంగబయలు పంచాయతీకు బీటీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చాను. ఇప్పుడు ఆ హామీని నెరవేర్చను.

– చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యే, అరకులోయ

కొత్తపేటవీధిలో చోరీ

యలమంచిలి : స్థానిక కొత్తపేటవీధికి చెందిన దొడ్డి సాయికుమార్ ఇంట్లో మంగళవారం దొంగలు ప్రవేశించి రెండు కెమెరాలు, రెండు సెల్‌ఫోన్లు అపహరించినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలు. బాధితుడు సాయికుమార్ బంధువులింట పెళ్లికి సోమవారం వేరే ఊరు వెళ్లాడు. రాత్రి ఇంటికి చేరుకున్నారు. మధ్య రాత్రిలో ఎవరో తలుపు తట్టినట్టు అనిపిస్తే, లేచి బయటకు వెళ్లి చూడగా, ఎవరూ కనిపించలేదు. దీంతో నిద్రపోయారు. తిరిగి ఉదయం నిద్రలేచాక చూస్తే తలుపు తెరిచి ఉంది. ఇంట్లో వస్తువులను పరిశీలించగా కెమెరాలు, ఫోన్లు దొంగతనానికి గురైనట్టు గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: ఒడిశాలో రైలు ప్రమాదం కారణంగా ట్రాక్‌ల నిర్వహణ, లింక్ రైళ్ల రాకపోకలు ఆలస్యంతో ఆయా స్టేషన్లలో బయలుదేరాల్సిన పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని సూచించారు.

- హౌరా-బెంగళూరు(12863) ఎక్స్‌ప్రెస్, షాలిమర్-వాస్కోడగామా(18047) ఎక్స్‌ప్రెస్, షాలిమర్-తిరువనంతపురం (22642) ఎక్స్‌ప్రెస్ మంగళవారం రద్దయ్యాయి.
- హౌరా-చెన్నై సెంట్రల్ (12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళ, బుధవారాల్లో రద్దు చేశారు.
- షాలిమార్-హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-షాలిమార్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్-హౌరా (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా-శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం (22831) ఎక్స్‌ప్రెస్, తాంబరం- సంత్రగచ్చి (22842) ఎక్స్‌ప్రెస్, భాగల్‌పూర్-విశ్వేశ్వరయ్య టెర్మినల్ (12254) ఎక్స్‌ప్రెస్, కన్యాకుమారి- డిబ్రూఘడ్ (22503) ఎక్స్‌ప్రెస్, షాలిమార్-సికింద్రాబాద్ (22849) ఎక్స్‌ప్రెస్, షాలిమార్-సికింద్రాబాద్ (12773)ఎక్స్‌ప్రెస్‌లను బుధవారం రద్దు చేశారు.
- బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-హౌరా(22888) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 8న రద్దు చేశారు.
- వాస్కోడగామా-షాలిమార్ (18048) ఎక్స్‌ప్రెస్, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం- హౌరా (22832) ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-అగర్తలా(12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 9న రద్దు చేశారు.

10న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న పలు నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 10న విశాఖపట్నం-గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

యువతిపై లైంగిక దాడి

- నిందితుడి అరెస్ట్



నిందితుడు కరణం వెంకట నాగేంద్రబాబు

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి వద్ద 19 ఏళ్ల యువతి లైంగిక దాడికి గురైంది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన వెలుగు చూసింది. మంగళవారం నిందితుడిని పట్టుకుని కోర్టుకు తరలించారు. అనకాపల్లి రూరల్ సీఐ ఎ.రవికుమార్ విలేకరులకు అందించిన వివరాలు. మండలంలోని నరసింగబిల్లి వద్ద తమ గ్రామానికి వెళ్లేందుకు 19 ఏళ్ల యువతి వాహనం కోసం ఎదురుచూస్తుండగా, సోమవరం గ్రామానికి చెందిన కరణం వెంకట నాగేంద్రబాబు(23) సోమవారం సాయంత్రం బైక్‌పై ఆమె వద్దకు వెళ్లి ఆగి మాట్లాడాడు. ఆమె తనతో రావడానికి నిరాకరించడంతో బలవంతంగా బైక్ ఎక్కించుకొని నరసింగబిల్లి రైల్వే గేటు వద్దకు బయల్దేరి, అక్కడి నుంచి పక్క మార్గంలో తీసుకెళ్లాడు. అక్కడ రైల్వే అండర్ పాసు వద్ద బైక్ నిలిపి ఆమెను లోపలికి బలవంతంగా లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి కేసు నమోదు చేశారు. మంగళవారం దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సోమవరంలో తన ఇంటి వద్ద నున్న నిందితుడు నాగేంద్రబాబును అరెస్ట్ చేశారు. నిందితుడ్ని అనకాపల్లి కోర్టులో జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం హాజరు పరచినట్లు తెలిపారు.

పిడుగుపడి మహిళ మృతి

- అపస్మారక స్థితికి మరొకరు



అపస్మారక స్థితికి చేరిన లక్ష్మి

మాకవరపాలెం : పిడుగులు పడి ఒక మహిళ మృతి చెందగా మరో మహిళ అపస్మారక స్థితికి చేరుకుంది. మండలంలో మంగళవారం సాయంత్రం పిడుగులు, ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఆ సమయంలో లచ్చన్నపాలెంలో ఇటంశెట్టి రమణమ్మ(47) పశువులకు గడ్డిని తీసుకువస్తుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందింది. తూటిపాలలో మామిడి కాయలు కోస్తుండగా సమీపంలో పిడుగు పడటంతో అనిమిరెడ్డి లక్ష్మి(50) అపస్మారక స్థితికి చేరింది. ఈమెను వెంటనే 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతురాలు రమణమ్మకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా
- పీహెచ్‌సీల తనిఖీ

ముంచంగిపుట్టు: మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా సూచించారు. మండలంలోని కిలగాడ పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మలేరియా, టైఫాయిడ్, క్షయ, కుష్టు రోగుల వివరాలు నమోదు రికార్డులను ఆయన పరిశీలించారు. పీహెచ్‌సీలో జరుగుతున్న ఆశా డే సమావేశంలో పాల్గొన్న ఆయన ఆశా కార్యకర్తలతో మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహణ, గర్భిణులకు అందుతున్న వైద్య సేవల వివరాలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం ముంచంగిపుట్టు సీహెచ్‌సీ, ఎస్ఎన్‌సీయూ కేంద్రాన్ని పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. అందుతున్న సేవల వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రసవాలపై వైద్యాధికారులు రమేష్, మౌనిక వివరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో వైద్య సేవలు అందించాలని, వ్యాధులతో నడవలేని, కదల్లేని రోగుల పరిస్థితి ముందే గుర్తించి ఆస్పత్రులకు తరలించాలని ఆయన అన్నారు. రానున్న ఎపిడమిక్ సీజన్ కోసం ముందస్తుగానే మలేరియా, టైఫాయిడ్ నమోదయ్యే గ్రామాలను గుర్తించి స్ప్రేయింగ్ చేయించాలని సూచించారు. ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కించాయిపుట్టు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

గిరిపుత్రుల జీవనంపై సినిమా

- రూ.25 కోట్ల వ్యయంతో చిత్రీకరణ
- దర్శక నిర్మాత గవిరెడ్డి శ్రీనివాసరావు





పోలీసుల వేషధారణలో నటులు

రోలుగుంట : రోలుగుంట, నాతవరం మండలాల్లోని గిరిజన ప్రాంతాల్లో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నర్సీపట్నం నియోజకవర్గం కొండలఅగ్రహారం పంచాయతీ బయపురెడ్డిపాలేనికి చెందిన గవిరెడ్డి శ్రీనివాసరావు రూ.25 కోట్ల వ్యయంతో చిత్ర నిర్మాణం చేపట్టారు. ఈ చిత్ర నిర్మాణంలో భాగంగా రోలుగుంటలోని వైబీ పట్నం, లోసింగి అటవీ ప్రాంతంలో బ్రిడ్జి, గిరిజన కుటీరాల సెట్ వేశారు. ఈ సెట్‌లో నక్సలైట్లు, పోలీస్ మధ్య కాల్పుల సీన్‌ను మంగళవారం చిత్రీకరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గవిరెడ్డి శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ గిరిజన బతుకులు, గంజాయి, మావోయిస్టుల ప్రభావంపై వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ సినిమాను రూపొందిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాల ద్వారా గిరిజనులు ఏ విధంగా అభివృద్ధి చెందవచ్చో ఈ సినిమాలో చర్చిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఈ చిత్రంలో సుమారు 400 మంది నటులకు అవకాశం కల్పించామన్నారు. మండలంతో పాటు నాతవరంలోని గిరిజన గ్రామాల్లో కూడా చిత్రీకరణ జరిపినట్టు వెల్లడించారు. ఈ చిత్రంలో హీరో ఆదర్శ్, హీరోయిన్లుగా వైశాలి, సీఐగా భరణి నటిస్తున్నట్టు తెలిపారు. నటులు, స్థానికుల సహకారంతో శరవేగంగా చిత్రీకరణ జరుగుతోందని, తప్పకుండా తమ చిత్రం విజయం సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు.

భక్త జన సంద్రం.. సన్యాసమ్మ తల్లి సంబరం



ఆకట్టుకున్న దేవతామూర్తులు, కాంతార వేషధారణలు



అమ్మవారి ప్రతిరూపంగా కొలిచే ప్రభలు

దేవరాపల్లి: శ్రీసన్యాసమ్మ తల్లి పెద్ద పండగ జనసంద్రాన్ని తలపించింది. 12 ఏళ్ల తర్వాత మంగళవారం జరిగిన మహోత్సవానికి వేలాదిగా భక్తజనం తరలి రావడంతో దేవరాపల్లి రహదారులన్నీ భక్తజనంతో కిక్కిరిశాయి. తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తులు, కాంతార, పులి, నెమలి వేషధారణలు, మహిళ తీన్‌మార్, కోయ డ్యాన్స్, ధింసా నృత్య ప్రదర్శనలు భక్తజనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీ సన్యాసమ్మ అమ్మవారికి ప్రతిరూపంగా కొలిచే ప్రభను చూసేందుకు భక్తులుబారులు తీరారు. తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. అనంతరం రాత్రికి పలు సంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అమ్మవారిని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. ఆయనకు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు తదితర ఆలయ కమిటీ సభ్యులు జ్ఞాపికను అందజేశారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

తుమ్మపాల: సమగ్ర శిక్ష కార్యాలయం జిల్లా గర్ల్ చైల్డ్ అభివృద్ధి అధికారి, అసిస్టెంట్ స్టాటస్టిక్స్ అధికారి పోస్టులలో డిప్యుటేషన్‌పై పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటన విడుదల చేశారు. 50 ఏళ్ల లోపు వయసున్న ఆసక్తి గల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఈ నెల 6వ తేదీ నుంచి 15వ తేదీలోగా తమ దరఖాస్తులను సమగ్ర శిక్ష కార్యాలయానికి నేరుగా సమర్పించాలన్నారు. దరఖాస్తులు, సూచనలు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి పొందవచ్చన్నారు.

ఉద్యానం.. మరింత విస్తారం

- ఈ ఏడాది 180 ఎకరాల విస్తీర్ణం పెంపు లక్ష్యం
- ఇప్పటికే జిల్లాలో 10,328 ఎకరాల్లో ఉద్యాన పంటలు
- డ్రాగన్, టిష్యూ అరటి, బొప్పాయి సాగుకు ప్రోత్సాహం
- ఈ ఉత్పత్తుల విక్రయాలకు మార్కెటింగ్ శాఖతో ఒప్పందం





ఉద్యాన విస్తరణ పథకంపై వేములవలసలో ఉద్యానశాఖ అధికారుల సమావేశం

సాక్షి, విశాఖపట్నం: ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని విస్తృతం చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం రైతులకు రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలో ఉద్యాన విస్తరణ పథకం కింద ఏటా కొంతమేర దీనిని విస్తరించాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. విశాఖపట్నం జిల్లాలో 10,328 ఎకరాల ఉద్యాన పంటల విస్తీర్ణం ఉంది. ఈ ఏడాది అదనంగా మరో 180 ఎకరాల్లో ఈ పంటలను విస్తరించాలని జిల్లా ఉద్యానశాఖ నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ప్రక్రియను ఉద్యానశాఖ అధికారులు చేపట్టారు. ఉద్యాన విస్తరణ పథకం కింద డ్రాగన్ ఫ్రూట్, టిష్యూ కల్చర్ అరటి, బొప్పాయి, కూరగాయలు తదితర పంటలు సాగు చేస్తారు. వీటితో పాటు జిల్లాలో మరో 500 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పథకంలో సాగు చేసే పంటలకు ప్రభుత్వం రాయితీ కూడా ఇస్తోంది. మొక్కలు, ఎరువులతో పాటు సాగుకు అవసరమైన పనిముట్లకు కూడా యూనిట్ ధరను బట్టి గరిష్టంగా 50 శాతం వరకు సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం జిల్లా ఉద్యానశాఖ అధికారులు ఆర్బీకే స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉద్యాన సాగు పెంపు ఆవశ్యకత, అధిక దిగుబడులనిచ్చే వంగడాలు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు తదితర అంశాలను రైతులకు వివరిస్తున్నారు. అదే సమయంలో వీటికి అర్హులైన రైతులను గుర్తింపు ప్రక్రియను కూడా మొదలు పెట్టారు. ఈ నెల 15 వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అనంతరం అవసరమైన నర్సరీలను కూడా ఎంపిక చేసి మొక్కలను పంపిణీ చేస్తారు. ఉద్యాన పంటల విస్తరణకు నీటి పారుదల, డ్రిప్, స్ప్రింక్లర్లు వంటి సదుపాయాలు కలిగి ఉండాలి. మరోవైపు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకాన్ని కూడా ప్రోత్సహిస్తున్నారు. ఇందులో మొక్కలను ఉచితంగా ఇవ్వడమే కాకుండా ఇందుకు అవసరమయ్యే కూలీలను కూడా ఈ పథకంలో సమకూరుస్తారు. ఇది రైతులకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు చేకూర్చనుంది.

మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం



రైతులు పండించిన ఈ ఉద్యాన పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం. ఈ ఉత్పత్తులను రైతు బజార్లలో విక్రయించేలా మార్కెటింగ్ శాఖ ద్వారా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఈ రైతులకు కార్డులను జారీ చేస్తాం. ఉద్యాన పంటల నాణ్యత, దిగుబడులు పెంచడం, రైతులకు మంచి ధర గిట్టుబాటు అయ్యేలా చూడడం వంటివి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం.

– మన్మథరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి, విశాఖపట్నం